క్లుప్తంగా

మంత్రి ప్రత్యేక పూజలు



సీతారామ మందిర ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలోని వడ్డివీధిలో సీతారామ మందిరం ప్రారంభోత్సవంలో స్త్రీ,శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం పాల్గొన్నారు. రాముల వారి చెట్టు వద్ద దీపం వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో సాలూరు–విశాఖపట్నం మధ్య బస్సు సర్వీసును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీటీఓ శ్రీనివాసరావు, మేనేజర్ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిగొస్తున్న చికెన్ ధరలు



పార్వతీపురం: శ్రావణమాసం కావడంతో చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. కొద్ది రోజుల కిందటి వరకు డ్రెస్డ్ చికెన్ కిలో 250 రూపాయలు పలకగా.. నేడు సగానికి పైగా తగ్గాయి. ప్రస్తుతం లైవ్ కోడి కిలో రూ. 78, డ్రెస్డ్ రూ. 130, స్కిన్‌లెస్ రూ. 150 చొప్పున విక్రయిస్తున్నారు. ధరలు తగ్గినా అమ్మకాలు పెద్దగా ఊపందుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

13న వేపారమ్మ తల్లికి చల్లదనం పూజలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక పాతబస్టాండ్‌లో వెలసిన వేపారమ్మ తల్లి ఆలయం వద్ద ఈనెల 13న చల్లదనం పూజలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ఆదివారం తెలిపారు. ఈ ఉత్సవంలో గ్రామస్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దుర్గమ్మ సేవలో భక్తులు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చు కొంగు బంగారం పాలకొండ కోటదుర్గమ్మ సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం కావటంతో ఇటీవల వివాహాలు చేసుకున్న వధూవరులు దేవస్థానంకు చేరుకుని మొక్కులు చెల్లించారు. ముగ్రాటలు, ఘటాలతో వచ్చి తల్లికి చల్లదనం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ, మనీల్‌కుమార్ శర్మ భక్తులు సమర్పించిన కానుకలు, ప్రసాదాలను అమ్మవారికి నివేదించారు.

అన్నవరంలో గ్రామసభ

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామంలో ఆదివారం సర్పంచ్ గవర రాజశేఖర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం కింద 2023–24 ఏడాదికి సంబంధించి చేపట్టిన 17వ విడత సోషల్ ఆడిట్‌లో గుర్తించిన పలు అంశాలను ఏపీఓ ఈశ్వరమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. చేపట్టిన పనులు, ఖర్చు, వేతనాల చెల్లింపు తదితరఅంశాలను వివరించారు. గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ఆడిట్ సిబ్బంది నమోదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలి



తుమరాడలో నిర్మాణదారులతో మాట్లాడుతున్న ఏఈ మాధవరావు

పాలకొండ రూరల్: జిల్లా యంత్రాంగం సూచనల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్మాణదారులకు స్టీల్, విద్యుత్ పరికరాలు, సిమ్మెంట్ తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచామని గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవరావు తెలిపారు. బుక్కూరు, తంపటాపల్లి, తుమరాడ తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

పౌష్టికాహార ఉద్యమం ప్రారంభం

- అంగన్‌వాడీ, పాఠశాలల్లో బడితోటల పెంపకం
- ఆరోగ్యకర జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మార్కొండపుట్టి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడితోటను పరిశీలిస్తున్న ఎంఈఓ

పార్వతీపురం : వంద రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బడితోటలను పెంచాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించడంతో అధికారులు పౌష్టికాహార ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో బడితోటలు సాగు చేస్తున్నారు. రక్తహీనత నివారణకు కూరగాయలు, ఆకుకూరలు అవసరమని వివరిస్తూ సేంద్రియ పద్ధతుల్లో సాగు



కొత్తపల్లి పాఠశాలలో బడితోటను పెంపకం చేస్తున్న ఉపాధ్యాయులు

చేపట్టాని పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అలాగే పౌష్టికాహార ప్రాముఖ్యతపై వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు బోధనతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకొచ్చి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ఆహార ఉత్పత్తులు వినియోగించడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని విద్యార్థులకు వివరిస్తున్నారు. బాలింతలు, కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్తహీనత నివారించేందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహార వస్తువులను అందజేస్తున్న విషయం విదితమే. అధిక పోషకాలున్న మునగ, తోటకూర, చుక్కకూర, గోంగూర, తదితర ఆకుకూరలు మధ్యాహ్న భోజనంలో వినియోగించేలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహిస్తున్న నిర్వాహకులకు సూచిస్తున్నారు. పౌష్టికాహార ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యమై ఆరోగ్యకర జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరుతున్నారు.

విద్యాశాఖలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

సాలూరు: విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు ఎం.వి.గౌరీశంకర్, బంకురు జోగినాయుడు, ఆర్నేపల్లి తిరుపతిరావు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. జీఓ 117ను తక్షణమే రద్దు చేస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు రద్దు చేయలేదన్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశా లలు మూతపడుతున్నాయన్నారు. సీబీఎస్ సిలబస్ వెనక్కి తీసుకునే అంశం, తెలుగు మీడియంను పునరుద్ధరించడం, స్టేట్ సిలబస్‌ను ప్రవేశపెట్టడం తదితర అంశాల్లో ప్రభుత్వం ఏమీ తేల్చకుండా నాన్చుడు వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీ లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, వారందరిని ఉద్యోగాల్లోకి తీసుకోకుండా ప్రభుత్వం కొత్తవారిని నియమిస్తామని అంటోందని, దీన్ని ఏపీటీఎఫ్ ఖండిస్తోందన్నారు. కేజీబీవీ సిబ్బందికి ఎంటీఎస్ అమలు చేయాలని, మోడల్ స్కూల్స్‌కి సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. అర్హులైన సీనియర్ అసిస్టెంట్‌లకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు వెంటనే ఇప్పించాలని, తదితర డిమాండ్లు చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

సాలూరు: అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహార పంపిణీ విధానంలో కొత్తగా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని పట్టణంలో ఆమె స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీల్లో లబ్ధిదారులకు ప్రతీ నెల ఫేస్ యాప్ ద్వారా ఫొటో తీసి, వారి ఫోన్ నంబరుకు ఓటీపీ పంపించి, అది విజయవంతమైన తరువాత వారికి సరుకుల పంపిణీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానాన్ని విజయనగరం, గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారులకు సరుకుల పంపిణీ ఆలస్యమవుతుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉమా, పైడిరాజు, అనసూయ, లక్ష్మి, ప్రభావతి, ఎస్.వై.నాయుడు తదితరులు ఉన్నారు.

రైల్వే లైన్ సాధనకు సమష్టి పోరాటం



రైల్వే లైన్ ఏర్పాటు కోరుతూ సమావేశమైన పౌరహక్కుల వేదిక సభ్యులు

పాలకొండ రూరల్: రైల్వే లైన్ సాధనకు రాజకీయాలకు అతీతంగా కలిసి పోరాడాలని, నాయకులు ఈ ప్రాంత ప్రజల వాణిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని పట్టణ పౌరహక్కుల వేదిక సభ్యులు పిలుపునిచ్చారు. ఎలైట్ కళాశాలలో ఆదివారం ఈ మేరకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు మాట్లాడుతూ.. గతంలో అనేక సందర్భాలలో రాజాం వయా పాలకొండ మీదుగా పలాస రైల్వే లైన్ ఏర్పాటు ప్రస్తావన వచ్చినా అది కార్యరూపం దాల్చలేదన్నారు. తాజాగా మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చిన క్రమంలో రైల్వే లైన్ సాధించుకునే వరకు అన్నివర్గాల ప్రజలు సమష్టిగా ముందుకు వచ్చి ఈ పోరాటంలో క్రియాశీలంగా వ్యవహరించాలని కోరారు. రైల్వే బోర్డు సభ్యుడు టంకాల దుర్గారావు మాట్లాడుతూ.. రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు రైల్వేతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ పనుల సాధనకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. సమావేశంలో బుడితి అప్పలనాయు డు, బౌరోతు శంకరరావు, కిల్లారి విజయ్‌కుమార్, దుంపల చిన్ని, శిల్లా బ్రహ్మాజీ తదితరులున్నారు.

నిర్లక్ష్యం.. ఆరోగ్యానికి హానికరం



పంటకు రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి
- లేదంటే ప్రాణాలకే ముప్పు
- వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: రైతులు సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం రసాయనిక పురుగు మందుల వాడకం తప్పనిసరి అయిపోయింది. ఈ పరిస్థితుల్లో పిచికారీ చేసే వ్యక్తి సరైన జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. పలు సందర్భాల్లో స్ప్రేచేసే వ్యక్తికి ఆరోగ్యం వికటించి ఆస్పత్రి పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆదమరిస్తే ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. మందుల పిచికారీలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ పలు సూచనలు చేశారు.

పిచికారీ ముందు..

- మందు పిచికారీకి పరిశుభ్రమైన నీటినే వాడడంతో పాటు చేతులు, కళ్లు, ముక్కు, నోరు, చెవులకు ప్రత్యేక రక్షణ తీసుకోవాలి.
- తలకు టోపీతో పాటు ముఖం మొత్తం కప్పేటట్టు చూసుకోవాలి.
- పురుగు మందులతో పాటు వచ్చిన కవర్లను వినియోగించకూడదు.
- ద్రావకాన్ని కలిపే ముందు డబ్బాపై ఉన్న లేబిల్‌ను గమనించి దాని ప్రకారం అవసరానికి అనుగుణంగా మందు కలుపుకోవాలి.
- మందు కలిపేటప్పుడు కచ్చితంగా కళ్లకు కళ్ల జోడు ఉంచుకోవాలి. లేనిపక్షంలో కలిపేటప్పుడు కళ్లల్లోకి తుల్లకుండా జాగ్రత్తపడాలి.
- ద్రావకాన్ని పంపులో పోసేటప్పుడు, పిచికారీ చేసేటప్పుడు బీడీ, సిగరెట్, ఖైనీ వంటివి వేసుకోకూడదు.
- మందును ముక్కుతో వాసన చూడకూడదు. పిచికారీ తర్వాత భోజనం చేసేటప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.

పిచికారీ చేసే విధానం..

- పిచికారీచేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి లీక్ అవ్వకుండా చూసుకోవాలి.
- సరైన నాజిల్ ఎంచుకోవాలి. పిచికారీ సమయంలో నాజిల్‌లో ఏదైనా అడ్డుపడితే నోటితో ఊదకూడదు.
- గాలి ఎక్కువగా వీచేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ ప్రయత్నాలు మానుకోవాలి.
- పిచికారీ సమయంలో గాలి వస్తున్నట్లయితే గాలికి వ్యతిరేకంగా పిచికారీ చేయకుండా గాలి వాలుకు చేసుకోవాలి.
- మందులు కలిపిన డబ్బాలలో నీరు పట్టుకొని తాగడం వంటివి చేయకుండా ఉండాలి.

డబ్బాలను జాగ్రత్తగా..

పిచికారీ పూర్తయిన తర్వాత మందు డబ్బాలను విచ్చల విడిగా పడేయకూడదు. డబ్బాలను కడిగి కాలువలు, నీటి కుంటలలో పోయకూడదు. అవసరానికనుగుణంగా మాత్రమే మందు కలుపుకోవాలి. మందు మిగిలిన డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకునే ఏర్పాటు చేసుకోవాలి. చిన్న పిల్లలకు, పశువులకు దగ్గరగా మందు డబ్బాలు ఉంచకూడదు. ఆకు కూరలకు మందు పిచికారీ చేసిన వెంటనే కోయకూడదు. కనీసం మూడు రోజుల తర్వాత కోయాలి.

గ్రామాల్లో దోమల నివారణ చర్యలు



లచ్చయ్యపేటలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ సీహెచ్ కృష్ణ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట, గుమ్మిడివరం గ్రామాల్లో సర్పంచ్ సీహెచ్ కృష్ణ పర్యవేక్షణలో ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ ఆధ్వర్యంలో ఆదివారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ కుమారవర్మ మాట్లాడుతూ, దోమల నివారణకు కాలువల్లో మలాథియాన్ ద్రావణం పిచికారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పెదబోగిలి పంచాయతీలో సువర్ణముఖీ నది నుంచి పంపిణీ అవుతున్న మంచినీటి పథకం ప్రధాన పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలియజేయగా.. కొత్త పైప్‌లైన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్‌డీ తెలిపారు. రెండు రోజుల్లో తాగునీరు పునరుద్ధరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి,సిబ్బంది పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యాక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రంథాలయ నిర్వాహకులు ఎన్.మధుసూదనరావు విద్యార్థులతో పద్యాలు, గద్యాలను చదివించారు. ప్రముఖ సంఘసంస్కర్తల జీవిత విశేషాలు, సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు వారు చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులతో చెస్, క్యారమ్స్, తదితర ఆటలను ఆడించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



నాటుబళ్లతో ఇసుకను తరలిస్తున్న దళారులు

బలిజిపేట : మండలంలో ఇసుక రీచ్‌లు కేటాయించకపోయినా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో సువర్ణముఖీ నది నుంచి ట్రాక్టర్లు, నాటుబళ్లతో ఇసుకను తరలించేస్తున్నారు. అధికారుల కళ్ల ముందే ఇసుక తరలిపోతున్నా చోద్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో సువర్ణముఖీ నదీ పరీవాహక ప్రాంతాలైన అరసాడ, పదమాయవలస, అజ్జాడ, నారాయణపురం, పి.రావివలసల వద్ద ఇసుకను నాటుబళ్లతో తరలించేవారు. అలాగే వేగావతి నదీ పరీవాహక ప్రాంతంలో అంపావల్లి, వంతరాం రేవుల వద్ద ఇసుకను తరించేవారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రకటించిందే తప్ప అందుకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయలేదు. పైగా మండలంలో ఎటువంటి రీచ్‌ల కేటాయింపు కూడా జరగలేదు. ఈ పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా నిలువరించే నాథుడే లేకుండాపోయాడు. ఇప్పటికైనా ఉచిత ఇసుకపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జనార్దనరావు వద్ద ప్రస్తావించగా.. మండలంలో ఇసుక రీచ్‌లు కేటాయించలేదు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

అనధికార విద్యుత్ కోతలతో అవస్థలు



చిలకలపల్లి సబ్‌స్టేషన్

బలిజిపేట: మండలంలో అనధికారిక విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అనధికారికంగా విద్యుత్ కోతలు విధించడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారు. గాలి, వాన, ఉరుములు, మెరుపులు, మబ్బులు కమ్మిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. పగలు ఉక్కబోతతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి అనధికార కోతలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ సింహాచలం వద్ద ప్రస్తావించగా.. బొబ్బిలి నుంచి విద్యుత్ సరఫరా అవుతున్నందున మధ్యలో అంతరాయం కలిగితే మనకు పవర్ అందుబాటులోకి రావడం లేదన్నారు.

అందుబాటులో ఎరువులు



పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం : మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులను మూడు విధాలుగా సరఫరా చేస్తామని మండల వ్యవసాయాధికారి ఎస్. అవినాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల పంపిణీ కేంద్రాలను పరిశీలించి ఆదివారం ఆయన పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ఉభాలు పూర్తయిన నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే ఎరువులను పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాలు, ప్రైవేటు దుకాణాల నుంచి సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే రైతులు చెరకు, జొన్న పైర్లకు ఎరువులు వేశారని తెలిపారు. వరి పంటకు డీఏపీ, పాస్పేట్, సూపర్, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు వేయాల్సి ఉందన్నారు. వ్యవసాయ శాఖాధికారులు సిఫార్సుల మేరకే ఎరువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యైవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



పార్వతీపురం టౌన్: వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై రవీంద్ర రాజు



సీతానగరం: వాహనాల వివరాలు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న ఎస్సై ఎం. రాజేష్

పార్వతీపురం టౌన్: వాహన చోదకులందరూ తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని పట్టణ ఎస్సై రవీంద్రరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద పెండింగ్ చలానా డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు పెండింగ్ చలానాలు ఉన్నట్లైతే తక్షణమే చెల్లించాలన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపరాధ రుసుం చెల్లించాలి..

సీతానగరం: బాకీ ఉన్న అపరాధ రుసుమును వాహనదారులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక హనుమాన్ జంక్షన్, రాష్ట్ర రహదారి కూడలి ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపరాధ రుసుం చెల్లించాల్సిన వారు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.శ్రీనివసరావు, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుతో

పాడిరైతుకు మేలు



పచ్చిక మేస్తున్న పశువులు (ఇన్‌సెట్లో) ప్రభా మాణిక్యరావు

- సాగులో మెలకువలు పాటిస్తే లాభదాయకం
- నాణ్యమైన పశుగ్రాసంతో పాలదిగుబడి రెట్టింపు
- పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మాణిక్యరావు

పాలకొండ రూరల్: పాడిపశువుకు రోజుకు 30–40 కిలోల పచ్చిమేత అవసరం ఉంటుంది. అందులో ఒక వంతు పప్పుజాతి, రెండు వంతులు ధాన్యపుజాతులను పశుగ్రాసాలుగా అందిస్తే పాలదిగుబడి పెరగడంతో పాటు ప్రస్తుత సీజన్‌లో పశువులకు మేలు చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు(ఏడీ) డాక్టర్ ప్రభా మాణిక్యరావు తెలిపారు. పశుగ్రాసం వినియోగంలో పాటించాల్సిన మెలకువలపై పాడిరైతులకు పలు సూచనలు చేశారు. ఒక ఎకరం పొలంలో వరి పంట సాగు చేస్తే రెండు పంటల మీద గరిష్ఠంగా రూ.20 వేలు ఆదాయం వస్తుంది. అదే పొలంలో పశుగ్రాసాలను సాగు చేసి 4, 5 పాడిపశువులను పోషిస్తే తద్వారా కనీసం రూ.50 వేలకుపైగా ఆదాయం పొందే అవకాశాలుంటాయన్నారు. పశువులకు పచ్చిమేత పుష్కలంగా అందిస్తే 5 లీటర్లకు పైబడి పాల దిగుబడి పొందవచ్చు. ధాన్యపుజాతి పశుగ్రాసాల సాగుకు యూరియా వాడడం వల్ల దిగుబడి ఎక్కువగా లభిస్తుంది. వీటిని పూత దశలో కోసి పశువులకు మేతగా వేయడం మంచిది.

పప్పుజాతి పశుగ్రాసాలతో..

పప్పుజాతి పశుగ్రాసాల సాగు వల్ల నత్రజని భూమిలో వృద్ధి చెందుతుంది. తద్వారా భూసారం పెరగడంతో పాటు నేలకోతను అరికట్టవచ్చు. అలాగే కలుపు నివారణ అవుతుంది. వీటి సాగుతో నత్రజని కంటే సూపర్ ఫాస్పేటు ఎరువులు వేయాల్సి ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలో జనుము సాగు వల్ల 40 కిలోలు, అలసంద సాగుతో 30 కిలోలు, లూసర్న్ సాగుతో 20 కిలోలు, స్టయిలో సాగుతో 50 కిలోల నత్రజని సమకూరుతుంది. పశువులకు ధాన్యపుజాతి, పప్పుజాతి పశుగ్రాసాలను 2:1 నిష్పత్తిలో అందించడం వల్ల పోషక పదార్థాలన్నీ ఏక కాలంలో లభ్యమవుతాయి. ధాన్యపుజాతి పశుగ్రాసాలలో, పప్పుజాతి పశుగ్రాసాలను మిశ్రమ పంటగా సాగు చేసుకోవాలి. మిశ్రమ పంటల వల్ల పప్పుజాతి పశుగ్రాసాలు ఒకవేళ ముదిరినా నాణ్యత కలిగి ఉంటాయి. కాల్షియం వంటి ఖనిజలవణాలు లభించి వరిగడ్డిలోని ఆక్సోలేట్ల విషపదార్థాల ప్రభావాన్ని నశింపజేస్తాయి.

పాడి అభివృద్ధికి దోహదం..

పాడిపరిశ్రమపై ఆధారపడే ప్రతి రైతు పచ్చిమేత తప్పనిసరిగా సాగు చేయాలి. తమకున్న భూమిలో కనీసం 10వ వంతు భూమిని పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా కేటాయించాల్సిన అవసరం ఉంది. పశుగ్రాసాలు ఒక సంవత్సర కాలంలో దిగుబడి 3–4 కోతల్లో వస్తుంది. వీటిని ఏక వార్షికాలు అంటారు. వీటిని వర్షాధారంగా సాగుచేసుకోవచ్చు. బహు వార్షికాలు ఒకసారి నాటితే 4–5 సంవత్సరాల పాటు దిగుబడిని ఇస్తాయి. నీటి సౌకర్యం ఉన్న సందర్భాల్లో బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసుకోవచ్చు. పశుగ్రాసాల్లో ధాన్యపుజాతి, పప్పుజాతి అని రెండు రకాలున్నాయి. జొన్న జాతికి చెందినవి ధాన్యపుజాతికి సంబంధించిన పశుగ్రాసాలు. వీటిల్లో పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కంకులు ఉండడం వల్ల పిండి పదార్థాలు లభిస్తాయి. ఇక పప్పుజాతి పశుగ్రాసాలు కాయలు కాస్తాయి. వీటిల్లో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పాడి పశువులకు పచ్చిమేతను సమతులంగా అందజేయడం వలన పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది.